## క్లుప్తంగా

### కరుణించమ్మా..



కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: వైఎస్సార్‌సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ సోమవారం డోలపేట కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో విజయం వరించాలని అమ్మవారిని మొక్కుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి, గోకవలస బాబూరావు, తదితరులు ఉన్నారు.

### ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు



ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



డాక్టర్ తలే రాజేష్

బొబ్బిలి/రాజాం: తెలుగువారి కొత్త సంవత్సరం ఉగాది ప్రజలందరి జీవితాల్లో సంతోషాలు నింపాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు క్రోధి నామ సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త సంవత్సరంలో మళ్లీ జగనన్న ప్రభుత్వమే వస్తుందని, రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెట్టింపు అవుతుందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ప్రజలంతా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

### మాజీ సైనికుల సమావేశం



సమావేశమైన మాజీ సైనికులు

బొబ్బిలి: స్థానిక పాత బొబ్బిలి పెట్రోల్ బంక్ వద్ద పట్టణానికి చెందిన వీరబొబ్బిలి మాజీ సైనికుల సంక్షేమ సంఘం సోమవారం సమావేశమైంది. సంఘ సభ్యులకు రావాల్సిన సౌకర్యాలు, ఇతర సంక్షేమం, హక్కులు, నూతన కార్యవర్గ ఎన్నికపై సభ్యులు చర్చించారు. గౌరవ అధ్యక్షుడు మరడ అప్పారావు, కోశాధికారి వీఎస్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రంలో ఉగాది వేడుకలు



బొబ్బిలి: పాత బొబ్బిలి అంగన్‌వాడీ కేంద్రంలో ఉగాది వేడుకలు

బొబ్బిలి: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాతబొబ్బిలి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఉగాది ప్రాశస్త్యాన్ని, తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలను చిన్నారులకు వివరించారు.

**ఆలయాల్లో ప్రత్యేక పూజలు**

బాడంగి: ఉగాది పండగలను పురస్కరించుకుని సోమవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాలకు వెళ్లి కొత్త సంవత్సరంలో తమకు అంతా మంచి జరగాలని కోరుకుంటూ పూజలు చేశారు.

### సకాలంలో టీకాలు వేయించాలి

రేగిడి: చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి జి.అసిరినాయుడు సూచించారు. అంబఖండి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వేస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సోమవారం పరిశీలించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా వర్కర్లు వ్యాక్సినేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు.

### ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని పాత బొబ్బిలిలో సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. రోడ్డుభద్రత నిబంధనలపై వాహనచోదకులకు అవగాహన కల్పించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు చెప్పారు.

# పార్టీలో చేరికలపై టీడీపీ జిమ్మిక్కులు



వైఎస్సార్‌సీపీ కండువాలతో కొట్టక్కి కార్యకర్తలు

- అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుతోవ పట్టించే యత్నం
- బలవంతపు చేరికలతో అభాసుపాలు

బొబ్బిలి: నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి చేరికలంటూ ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రచారం అవాస్తవమని తేలిపోయింది. రామభద్రపురం మండలం కొట్టక్కి నుంచి పలువురు టీడీపీలోకి చేరాని టీడీపీ నేతలు ప్రచారం చేసిన మరుసటి రోజే.. పార్టీలో చేరినవారంతా మేం టీడీపీలో చేరలేదని, తమను పిలిచి బలవంతంగా పార్టీ కండువాలు వేశారని స్పష్టం చేశారు. వారంతా తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాగే బొబ్బిలి మండలం అలజంగి నుంచి వందలాది మంది టీడీపీలో చేరిపోయారని పెద్ద ప్రచారం చేశారు. కానీ వారికన్నా అధిక సంఖ్యలో ఆ గ్రామం నుంచి ర్యాలీగా వచ్చి వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాగే బాడంగి మండలం కోడూరు, రామచంద్రపురం గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీలోకి చేరికలనే వార్తను ప్రచారం చేసుకున్నారు. కానీ ఇదంతా నిజం కాదని, తాము వైఎస్సార్‌సీపీలోనే ఉన్నామంటూ వారు తిరిగి వైఎస్సార్‌సీపీ నాయకుల వద్దకు వచ్చి కండువాలు కప్పుకున్నారు. రెండు రోజుల కిందట రామభద్రపురం మండలం నాయుడువలస, పాలవలస గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు టీడీపీలో చేరినట్లు మళ్లీ ఊకదంపుడు ప్రచారం మొదలెట్టింది పచ్చదండు. కానీ మరుసటి రోజు సాయంత్రమే ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు వద్దకు వారంతా వచ్చి మమ్మల్ని మభ్యపెట్టి తీసుకెళ్లి కండువాలు వేశారని, మేం మాత్రం పార్టీ మారలేదని, సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందిస్తున్న వైఎస్సార్‌సీపీని ఎందుకు వీడుతామని చెప్పి, వైఎస్సార్‌సీపీ కండువాలు వేసుకున్నారు. ఇలా బొబ్బిలి, తెర్లాం, రామభద్రపురం, బాడంగి మండలాలతో పాటు మున్సిపాలిటీలోనూ టీడీపీ నాయకులు అసత్య ప్రచారాలతో మైండ్‌గేమ్ ఆడుతున్నారని వైఎస్సార్‌సీపీ వర్గాలు మండిపడుతున్నాయి.

# ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి



వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తరువాత బొబ్బిలిలో పరిపాలనను, చంద్రబాబు నాయుడు హయాంలోని పరిపాలనను బేరీజు వేసుకుని, రానున్న ఎన్నికల్లో మీరంతా ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు వాకర్స్‌ను అభ్యర్థించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం ఉదయం వాకింగ్ చేస్తున్న వారిని కలిసి మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మే 13న జరిగే పోలింగ్‌లో మీ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ ఛైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, జేసీఎస్ పట్టణ ఇన్‌ఛార్జి రేజేటి ఈశ్వరరావు(విసు), పార్టీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, నాయకులు వాడపల్లి మనోజ్‌కుమార్, మరిపి తిరుపతిరావు, తదితరులున్నారు.

# షడ్రుచుల సమ్మేళనమే ఉగాది

- నేటి నుంచి క్రోధి నామ సంవత్సరం ప్రారంభం
- కొత్త సంవత్సర వేడుకలకు సిద్ధమైన తెలుగు ప్రజలు



ఉగాది పచ్చడికి వేప పువ్వు, మామిడి కాయలు కొనుగోలు చేస్తున్న మహిళ

రాజాం సిటీ: తెలుగు వారి మొదటి పండగ.. తెలుగు సంవత్సరాది ఉగాది. 'ఉ' అంటే నక్షత్రం, 'గ' అంటే గమనం. నక్షత్ర గమనాన్ని లెక్కించటం ప్రారంభించే రోజును ఉగాదిగా జరుపుకుంటారు. చైత్ర శుద్ధ పాడ్యమి రోజున ఈ వేడుక నిర్వహిస్తారు. ఈ నెల 8తో శోభకృత్ నామ సంవత్సరం ముగిసి, మంగళవారంతో క్రోధి నామసంవత్సరం ప్రారంభం కానుంది. ఉగాది పండగను తెలుగు ప్రజలు ఎంతో ఘనంగా జరుపుకుంటారు. వేకువ జామున లేచి స్నానాలు ఆచరించి కొత్త దుస్తులు ధరించి పూజలు చేస్తారు. రైతులు పొలానికి వెళ్లి ఏరువాక నిర్వహిస్తారు. ఇంటి ముందు రంగవల్లులు వేసి, గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి కొత్త సంవత్సరానికి స్వగతం పలుకుతారు.

**ఉగాది పచ్చడి ప్రత్యేకం..**

ఉగాది పండుగ అనగానే ఉగాది పచ్చడి, కవిసమ్మేళనం, పంచాంగ పఠనం తదితర సంప్రదాయాలు గుర్తుకొస్తాయి. పండుగ రోజు బెల్లం, చింతపండు, ఉప్పు, కారం, వేపపువ్వు, మామిడి కాయలతో (షడ్రుచులు కలిపిన) పచ్చడి తయారుచేస్తారు. ఇందులో ఉన్న ఒక్కో రుచి మన జీవితంలోని ఒక్కో భావానికి ప్రతీకగా చెపుతారు. వైద్య పరంగా ఈ పచ్చడి వ్యాధి నిరోధక శక్తిని కలిగిస్తుంది.

**పంచాంగ శ్రవణం..**

కొత్త సంవత్సరంలో వివిధ రాశుల వారి స్థితిగతులను తెలియజేస్తూ వేదపండితులు పంచాంగాన్ని పఠిస్తారు. ఆదాయ, వ్యయాలు, రాజపూజ్యం, అవమానం వంటి అంశాలను వివరిస్తారు. కాలం తీరు, పంటల సాగు తదితర అంశాలను కూడా పంచాంగం ఆధారంగా పండితులు వివరిస్తారు.

**నూతన పనులు ప్రారంభం..**

ఉగాది రోజున రైతులు వ్యవసాయ పనులు ప్రారంభిస్తారు. వ్యవసాయ పనిముట్లు శుభ్రం చేస్తారు. ఎద్దులను కడిగి అలంకరిస్తారు. గ్రామ కూడళ్లలో రైతులు చేరి సాగుచేసే పంటల గురించి చర్చించుకుంటారు. ఇతర వర్గాల వారు వారి పనులను నూతనోత్సాహంతో ప్రారంభిస్తారు.

**కవి సమ్మేళనం..**

పండుగ రోజు సాయంత్రం వేళలో కవి సమ్మేళనం నిర్వహిస్తారు. ఉగాది ప్రాముఖ్యత, తెలుగు వారి సంప్రదాయాలు, షడ్రుచులు, ఆచార వ్యవహారాలు తదితర అంశాలుపై కవులు తమ కవితలు, పద్యాల రూపంలో వివరిస్తారు.

# ముగడలో 20 మంది వలంటీర్ల రాజీనామా



కార్యదర్శి సుగుణకు రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు

బాడంగి: మండలంలోని ముగడ గ్రామ సచివాలయం పరిధిలో సేవలందిస్తున్న 20 మంది వలంటీర్లు సోమవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. పంచాయతీ కార్యదర్శి జి.సుగుణకు రాజీనామా పత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య అనుసంధాన కర్తలుగా నిస్వార్థ సేవలందిస్తున్న తమపై ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేయడం, తమ సేవలను కించపరడంతో మనస్తాపం చెంది విధుల నుంచి తప్పుకుంటున్నట్లు చెప్పారు. మళ్లీ జగనన్న ప్రభుత్వమే వస్తుందని, తమకు వలంటీర్లుగా మళ్లీ అవకాశం ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొని వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం తమ వంతు కృషిచేస్తామన్నారు.



# ఓటు అడిగే హక్కు రాజులకు లేదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బాడంగి: మూడు దశాబ్దాలుగా కోడూరు ప్రాంతానికి రోడ్లు, తాగునీరు, సాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించలేని రాజులకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు లేదని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మండిపడ్డారు. నియోజకవర్గ ప్రజలను ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుకు మాత్రమే ఉందన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాయంలో పార్టీ నాయకులు తెంటు మధుసూదనరావు, కండి సురేష్, జేసీఎస్ కన్వీనర్ మరిపిశంకరావు, కోడూరు ఉపసర్పంచ్ రెడ్డి కృష్ణ, ప్రధాన కార్యదర్శి తెర్లి శ్రీనివాసరావు, తెంటు రామినాయుడు తదితరులు సోమవారం విలేకరులతో మాట్లాడారు. కోడూరుకు చెందిన జిల్లా బీసీ సాధికారిత కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు పత్రికా ముఖంగా ఆదివారం చేసిన ఆరోపణలను వారంతా తీవ్రంగా ఖండించారు. కోడూరులో తాగునీటి సమస్య ఉందని, రక్షితపథకం ద్వారా చుక్కనీరు రావడంలేదని విమర్శించడం సరికాదన్నారు. ఎక్కడో ఉండి విమర్శలు చేయకుండా స్థానికంగా ఉండి వాస్తవాలను తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. 2019లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే శంబంగి హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చించేందుకు మేము సిద్ధం, మీరు సిద్ధమా అని సవాల్ విసిరారు.

## సంక్షేమం, అభివృద్ధికి మరోసారి పట్టం కట్టండి

- ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు



మాట్లాడుతున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రానున్న ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడును గెలిపించుకుందామని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి లబ్ధి జరిగిందన్నారు. ప్రతిపక్షాలన్నీ ఏకమైనా రాష్ట్రంలోని ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారన్నారు. ప్రతిపక్షాలు బూటకపు హామీలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, వాటి హామీలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. భావి తరాల భవిష్యత్ కోసం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు, పాలసొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, మండల సచివాలయ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పీఏసీఎస్ ఛైర్మన్ కిర్ల చంద్రశేఖర్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కటికి చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత ఎన్నికలే లక్ష్యం: ట్రైనీ డీఎస్పీ



సంతకవిటి: మండాకురిటిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

సంతకవిటి: మండలంలోని మండవకురిటి, వాల్తేరు గ్రామాలలో సోమవారం పోలీసు బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలలో శాంతిభద్రతల పర్యవేక్షణకు ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామని ట్రైనీ డీఎస్పీ ఎస్.మహేంద్ర తెలిపారు.

రేగిడి: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని, గ్రామాల్లో ఎటువంటి గొడవలు జరుగకుండా చూసుకోవాలని ఎస్సై శ్రీనివాసరావు సూచించారు. మండలంలో వన్నలి గ్రామస్తులతో సోమవారం సమావేశమయ్యారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, వివాదాల జోలికి వెళ్లొద్దని సూచించారు. గ్రామంలో మద్యం, డబ్బు పంపిణీ వంటివి జరుగకుండా చూడాలన్నారు. పంచాయతీ సర్పంచ్ గార రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆసక్తిగా పంచాంగ శ్రవణం



వంగర: పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు



సంతకవిటి: శ్రీహరినాయుడుపేటలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు



రాజాం: బుచ్చింపేటలో పంచాంగ పఠనం చేస్తున్న పండితుడు



తెర్లాం: పెరుమాళిలో పంచాంగ పఠనం చేస్తున్న పండితులు



బొబ్బిలి: పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రాజాం/వంగర/సంతకవిటి/తెర్లాం: ఉగాది పండగను పురస్కరించుకుని గ్రామాల్లోని ఆలయాల వద్ద సోమవారం వేదపండితులు పంచాంగాన్ని పఠించారు. క్రోధి నామ సంవత్సరంలో వివిధ రాశుల వారికి ఆదాయం, వ్యయం, అవమానం, రాజ్యపూజ్యం వంటివి ఏవిధంగా ఉంటాయో వివరించారు. కొత్త సంవత్సరంలో పంటలు బాగా పండుతాయని, వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో చేరి వారి రాశిఫలాలను ఆసక్తిగా తెలుసుకున్నారు.

## ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ



తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో క్రోధినామ సంవత్సర త్రైత సిద్ధాత ఉగాది (తెలుగు సంవత్సరం) క్యాలెండర్‌ను బొద్దాం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక సభ్యులు సోమవారం ఆవిష్కరించారు. మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు క్యాలెండర్‌ను ప్రదర్శించి పలువురికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఇందూ జ్ఞానవేదిక సభ్యులు మాట్లాడుతూ.. త్రిమత ఏకైక గురువు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన తెలుగు కాలసూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ఈ క్యాలెండర్ రూపొందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఇందూ జ్ఞానవేదిక బొద్దాం అధ్యక్షుడు రామినాయుడు, సభ్యులు కె.గణేష్, కె.ప్రసాద్, జె.పాపారావు, జె.రోహిత్, పి.అప్పన్న, ఎమ్.సత్యం, ఎస్.అప్పలరాజు, కె.మురళి తదితరులు పాల్గొన్నారు.

## అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని అంబాడ వెంకటాపురం, పెద్దశిర్లాం తదితర పాఠశాలలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి వారి సామర్థ్యాలను పరిశీలించారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పనిచేసి విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచేలా చూడాలన్నారు. జగనన్న గోరుముద్ద పథకం చక్కగా అమలు చేయాలని సూచించారు. పాఠశాల హెచ్ఎం ఎందువ రామకృష్ణ, సహోపాధ్యాయులు బోర నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.